సాక్షి ఒడిశా

ఆదివారం । 26 । ఫిబ్రవరి । 2023




శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం శనివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,95,034లు, బంగారం 14.93 మిల్లీగ్రాములు, వెండి 142.6 గ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



కొత్త ఒరవడితో ముందుకు సాగండి

- 8లో



దేవతామూర్తులకు పిలుపు

- 8లో

న్యూస్‌రీల్

సరిహద్దులో కొనసాగుతున్న ఎక్సైజ్ దాడులు



గుణుపూర్ సబ్ డివిజన్ పరిధిలో దాడులు నిర్వహిస్తున్న అధికారులు

రాయగడ: గత కొద్ది రోజులుగా ఆంధ్ర, ఒడిశా సరిహద్దులో సంయుక్తంగా దాడులను నిర్వహించిన ఎక్సైజ్ అధికారులు.. జిల్లాలోని గుణుపూర్ సబ్ డివిజన్ పరిధిలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో 7 కేసులు నమోదు చేసి, ఆరుగురు వ్యక్తులను అరెస్ట్ చేశారు. వారి నుంచి 80లీటర్ల తాటికల్లు, 217 లీటర్ల సారా, 1600 లీటర్ల విప్పమొగ్గ ఊట, బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎక్సైజ్ అధికారి అభిరాం బెహరా తెలిపారు.

చెత్తకు భారీ జరిమానా



బీఎంసీ 32వ నంబర్ వార్డులో దుస్థితి

భువనేశ్వర్: నగరంలో వీధుల నిర్వహణ పట్ల స్థానిక నగరపాలక సంస్థ(బీఎంసీ) ప్రత్యేకంగా శ్రద్ధ వహిస్తోంది. ప్రధానంగా పారిశుద్ధ్య నిర్వహణ, మురుగునీరు నిరాటంక ప్రవాహం పట్ల మరింత శ్రద్ధ వహించడం విశేషం. ఈ నేపథ్యంలో బీఎంసీ 32వ నంబర్ వార్డులో అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఇందులో రోడ్డు పక్క మురుగు కాలువలో నిత్య వినియోగ వ్యర్థ పదార్థాలు వేసిరేస్తున్నట్లు గుర్తించారు. ఈ చర్యపట్ల బీఎంసీ ఘాటుగా స్పందించింది. మురుగు కాలువ ఒడ్డున పని చేస్తున్న బ్యాంక్ ఆఫ్ బరోడా, ఓం మెడిసిన్ స్టోర్ చెత్త వేసినట్లు తనిఖీ వర్గాలు ధ్రువీకరించాయి. ఈ రెండు వర్గాలకు చెరో రూ.10 వేల చొప్పున జరిమానా విధించారు.

నాలుగేళ్లయినా నత్తనడకే!

పర్లాకిమిడి: పట్టణానికి సమీపంలోని గుసాని బ్లాక్ తులసిపాడు మౌజాలో ప్రారంభించిన జిల్లా నైపుణ్యాభివృద్ధి భవన నిర్మాణం మూడేళ్లయినా ఇప్పటి వరకు పనులు పూర్తి కాలేదు. సుమారు రూ.3.5 కోట్ల వ్యయంతో 2018లో ప్రారంభించారు. అయితే ఇప్పటి వరకు భవనాన్ని సంబంధిత డీఆర్‌డీఏ అధికారులకు అప్పగించలేదు. దీంతో జిల్లాలో నైపుణ్యాభివృద్ధి శిక్షణను అధికారులు అందించలేకపోతున్నారు. దీని ఫలితంగా జిల్లాకు చెందిన దాదాపు లక్షన్నర మంది నిరుద్యోగ యువత ఆంధ్ర, తెలంగాణా, కోల్‌కత్తా తదితర ప్రాంతాలకు వలస పోతున్నారు. మాల్స్, వస్త్ర, రెడీమేడ్ దుకాణాల్లో పనిచేస్తున్న వారు చాలీచాలని వేతనాలతో నెట్టుకొస్తున్న సందర్భాలు ఉన్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి, స్కిల్ డెవలప్‌మెంట్ భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసుకుని నిరుద్యోగ యువత కోరుతున్నారు.

హతుడు పోలీస్ ఇన్‌ఫార్మర్ కాదు


- దక్షిణాంచల్ డీఐజీ రాజేష్ పండిట్



బాధితులను పరామర్శిస్తున్న డీఐజీ, ఎస్పీ

కొరాపుట్: నవరంగ్‌పూర్ జిల్లాలో మావోయిస్టుల చేతిలో హత్యకు గురైన చందన్ మాలిక్ పోలీస్ ఇన్‌ఫార్మర్ కాదని దక్షిణాంచల్ డీఐజీ రాజేష్ పండిట్ ప్రకటించారు. నవరంగ్‌పూర్ జిల్లా రాయిఘర్ ప్రాంతాన్ని ఆయన శనివారం సందర్శించి, మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. వారికి ప్రభుత్వం తరుపున రూ.4 లక్షల సాయం అందజేశారు. అనంతరం నవరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని జానకీ నగర్‌లో ఉన్న జిల్లా పోలీస్ రిజర్వ్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. మృతుడు చందన్ మాలిక్ ఏరోజూ పోలీసులతో కలిసి పని చేయలేదని స్పష్టంచేశారు. గతంలో కూడా మృతుని కుటుంబాన్ని మావోయిస్టులు పలుమార్లు హెచ్చరించారన్నారు. ఇది ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని మెయిన్‌పూర్ డివిజన్ కమిటీ దుశ్చర్యగా అభివర్ణించారు. మావోయిస్టుల ఏరివేతకు సీఆర్‌పీఎఫ్, డీవీఎఫ్ దళాలు కూబింగ్ చేపడుతున్నాయని వివరించారు. పర్యటనలో నవరంగ్‌పూర్ జిల్లా ఎస్పీ ఎస్.సుశ్రీ, సీఆర్‌పీఫ్ 12 బెటాలియన్ కమాండెంట్ ఎస్‌కేకే ప్రసాద్ పాల్గొన్నారు.

మార్చి 1నుంచి ప్లస్2 పరీక్షలు




పరీక్షలు రాస్తున్న విద్యార్థులు (ఫైల్)

- 10నుంచి మెట్రిక్యులేషన్ పరీక్షలు ప్రారంభం
- వెల్లడించిన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సమీర్ దాస్
- రాష్ట్రంలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి హామీ

భువనేశ్వర్: ఈ ఏడాది మార్చి 1నుంచి ప్లస్2 పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు సన్నాహాలు పూర్తయినట్లు రాష్ట్ర పాఠశాలలు–సామూహిక విద్యాశాఖ మంత్రి సమీర్ రంజన్‌దాస్ తెలిపారు. హబ్‌కు ప్రశ్న పత్రాల తరలింపు, పరీక్షల సక్రమ నిర్వహణ కోసం విస్తృత ఏర్పాట్లు చేసినట్లు శనివారం ప్రకటించారు. మెట్రిక్యులేషన్(10వ తరగతి) పరీక్షలు మార్చి 10 నుంచి ప్రారంభమవుతాయన్నారు. డిమాండ్లను నెరవేర్చకుంటే పరీక్షల నిర్వహణ ప్రక్రియను బహిష్కరిస్తామని అధ్యాపక వర్గం ముందస్తు హెచ్చరిక జారీ చేసింది. ఈ విషయం దృష్టికి వచ్చిందని, అధ్యాపకులతో చర్చించి సమస్యను పరిష్కరించేందుకు పిలుపునిస్తామని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత నివారిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయుల ఖాళీల భర్తీకి మాస్ టీచర్ రిక్రూట్‌మెంట్ జరగనుందని వెల్లడించారు.

ఆదర్శ పాఠశాలలకు ప్రవేశాలు..

రాష్ట్ర మాధ్యమిక విద్యా బోర్డు(బోర్డ్) ఆధ్వర్యంలో ఒడిశా ఆదర్శ విద్యాలయం ప్రవేశ పరీక్ష(ఓఏవీఈటీ–2023), ఒడిశా మైనింగ్ ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష(ఓఎంఏవీఈటీ–2023) ఈ ఏడాది మార్చి 5న నిర్వహిస్తారు. రాష్ట్రంలోని 929 పరీక్షా కేంద్రాల్లో పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ పరీక్షకు నమోదు చేసుకున్న అభ్యర్థుల అడ్మిట్ కార్డును బోర్డు వెబ్‌సైట్ www.bseodisha.ac.inలో అందుబాటులో ఉంచారు. ఒడిశా ఆదర్శ విద్యాలయం ప్రవేశ పరీక్షలో 6వ తరగతికి 1,36,491మంది పేర్లు నమోదు చేసుకోగా, 7వ తరగతికి 17,154మంది, 8వ తరగతికి 12,456మంది, 9వ తరగతికి 5,716మంది పేర్లు నమోదు చేసుకున్నారు. ఒడిశా మైనింగ్ ఆదర్శ పాఠశాలలో 6వ తరగతికి 4,366మంది అభ్యర్థులు వివరాలు నమోదు చేసుకున్నారని రాష్ట్ర మాధ్యమిక విద్యాబోర్డు ఉపాధ్యక్షుడు డాక్టర్ నిహార్‌రంజన్ మహంతి ప్రకటించారు.



విద్యాశాఖ మంత్రి సమీర్ రంజన్‌దాస్

సిలబస్, గ్రేడింగ్ యథాతథం

కొత్త విద్యా సంవత్సరం ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ప్రారంభమై, 2024 మార్చి వరకు కొనసాగుతుంది. 2022–23 విద్యా సంవత్సరంలో ప్రవేశపెట్టిన పాఠ్యాంశాలు కొత్త విద్యా సంవత్సరంలో 2023–24లో సైతం కొనసాగుతాయి. గ్రేడింగ్ విధానం కూడా ఈ ఏడాది యథాతథంగా అమలవుతుందని రాష్ట్ర మాధ్యమిక విద్యాబోర్డ్ జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. అయితే 10వ తరగతి ఫిజికల్ సైన్స్ పుస్తకంలో నక్షత్రం గుర్తు ఉన్న పాఠ్యాంశాలు చదవడం తప్పనిసరి చేశారు. ఈ పాఠ్యాంశాలు నుంచి పరీక్షలో ప్రశ్నలు ఉంటాయని బోర్డు స్పష్టం చేసింది. తొమ్మిదో తరగతిలో ప్రవేశపెట్టిన ఆస్పిరేషనల్ కాంపోనెంట్‌లు 2023–24లో మెట్రిక్, ఇంటర్మీడియట్(ప్లస్2 శ్రేణులు) రెండింటిలోనూ ప్రవేశ పెడతారు. దీనికి సంబంధించిన మొత్తం సమాచారం బోర్డు వెబ్‌సైట్‌లో ప్రసారం చేశారు. గత ఏడాది ప్రవేశ పెట్టిన ప్రశ్నాపత్రం, పరీక్షల విధానాన్నే కొత్త విద్యా సంవత్సరంలో అమలు చేయనున్నట్లు బోర్డు ఉపాధ్యక్షుడు డాక్టర్ నిహార్‌రంజన్ మహంతి వెల్లడించారు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు..

ప్రైవేటు విద్యాసంస్థల తరహాలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలు సరఫరా చేస్తారని మంత్రి సమీర్ రంజన్ తెలిపారు. పిల్లల హోం వర్క్, టీచర్లు ఏం బోధిస్తున్నారనేది నోట్‌బుక్‌లో వివరాలు అందుబాటులో ఉంటాయని, తద్వారా బిడ్డ ఏం చదువుతున్నాడో తల్లిదండ్రులకు తెలుస్తుందన్నారు. కొత్త బడ్జెట్‌లో విద్యా రంగానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత కల్పించడం విశేషంగా పేర్కొన్నారు.

బడ్జెట్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలి



- పార్టీ ఎమ్మెల్యేలకు సీఎం నవీన్ పిలుపు

భువనేశ్వర్: రాష్ట్ర శాసనసభలో అత్యంత ప్రజాకర్షిత బడ్జెట్‌ను ఆర్థికశాఖ మంత్రి నిరంజన పూజారి సభలో ప్రవేశ పెట్టిన విషయం తెలిసిందే. ప్రజల కోసం ప్రజలే రూపొందించుకున్న ప్రజాధార బడ్జెట్ ఇదని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అభివర్ణించారు. మరోవైపు ఇది ఎన్నికల ప్రలోభిత బడ్జెట్ అని ప్రతిపక్ష నేత, బీజేపీ ఎమ్మెల్యే జయనారాయణ మిశ్రా వ్యాఖ్యానించారు. ఈ హడావిడి ముగియడంతో బిజూ జనతాదళ్ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ తన నివాసంలో శుక్రవారం రాత్రి పార్టీ ఎమ్మెల్యేలతో అత్యవసర సమావేశం నిర్వహించారు. సుమారు 100మందికి పైగా ఎమ్మెల్యేలు, మంత్రులు ఈ సమావేశానికి హాజరైనట్లు సమాచారం. ఈ సందర్భంగా బడ్జెట్‌లో ప్రజలకు సంబంధించిన అంశాలను సభ్యులకు వివరించారు. ఏయే పథకాలు సామాన్య ప్రజలకు ప్రత్యక్షంగా అక్కరకు వస్తాయో వివరించారు. 2024లో సార్వత్రిక ఎన్నికలు ఉన్నందున ఇదే చివరి పూర్తి బడ్జెట్‌గా గుర్తించాలన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని, ప్రజా–ఆధారిత బడ్జెట్‌పై అట్టడుగు స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలదే అని స్పష్టంచేశారు. రాష్ట్రవ్యాప్తంగా మండల స్థాయిలో పలు కార్యక్రమాలు నిర్వహించి, ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. దీనికి సంబంధించిన బ్లూప్రింట్‌ను త్వరలోనే సిద్ధం చేయనున్నట్లు ప్రకటించారు. బడ్జెట్‌లో పథకాలు, కార్యక్రమాలు ఇతరేతర ప్రకటనలు ఉద్దేశించిన లబ్ధిదారులకు క్షేత్ర స్థాయి వరకు చేరవేయాలన్నారు. ఇదిలా ఉండగా... ప్రజాకర్షిత బడ్జెట్ కేటాయింపులతో సార్వత్రిక ఎన్నికల్లో పూర్తిస్థాయి ప్రయోజనం చేకూర్చుకోవడమే ధ్యేయంగా సీఎం నవీన్ పావులు కదుపుతున్నట్లు స్పష్టమవుతోంది.

పాత కక్షలతో వ్యక్తి హత్య



గ్రామస్తులను విచారిస్తున్న ఎస్‌డీపీఓ దాస్, చందిలి పోలీసులు

రాయగడ: ఇద్దరి మధ్య పెరిగిన పాతకక్షల కారణంగా నిండు ప్రాణం బలైపోయింది. జిల్లాలోని చందిలి పోలీస్ స్టేషన్ పరిధి కైలాసపూర్ పంచాయతీ తొరలబడి గ్రామంలో శనివారం ఈ ఘటన చోటు చేసుకుంది. మృతుడు అదే గ్రామానికి చెందిన చితు హెప్రుక(40)గా గుర్తించారు. రాయగడ ఎస్‌డీపీఓ దేవజ్యోతి దాస్ అక్కడికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. తొరలబడి గ్రామానికి చెందిన చితు, అదే గ్రామానికి చెందిన బంగా కొండగిరి(32) మధ్య గత కొద్ది నెలలుగా మనస్పర్థలు ఉన్నాయి. తరచూ ఇద్దరి మధ్య గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి భోజనం చేసిన చితు.. ఆరుబయట వరండాలో నిద్రకు ఉపక్రమించాడు. అంతా గమనించిన బంగా అర్ధరాత్రి సమయంలో గునపంతో దాడి చేశాడు. చితు తలపై బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రక్తపు మడుగులో పడి ఉన్న భర్తను చూసిన భార్య కేకలు వేయడంతో చుట్టుపక్కల వారంతా అక్కడికి చేరుకుని చందిలి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌డీపీఓ దాస్, సిబ్బంది గ్రామానికి చేరుకున్నారు. కేసుతో సంబంధం ఉన్న మరో నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

మల్కన్‌గిరిలో వాణిజ్య మంత్రి పర్యటన



మంత్రి టుకినీ సాహుకు స్వాగతం పలుకుతున్న అధికారులు



పాలిటెక్నికల్ కళాశాల విద్యార్థులతో ఉషా పాఢి, సిబ్బంది

మల్కన్‌గిరి: రాష్ట్ర వాణిజ్య, రవాణాశాఖ మంత్రి టుకునీ సాహు, రవాణా, విద్య నైపుణ్యాభివృద్ధి కార్యదర్శి ఉషా పాఢి జిల్లా కేంద్రంలో శనివారం పర్యటించారు. వీరికి జిల్లా కలెక్టర్ విశాల్‌సింగ్, మల్కన్‌గిరి పురపాలక సంఘం అధ్యక్షుడు మానోజ్ బారిక్ పుష్పగుచ్ఛం అందించి, స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మల్కన్‌గిరి లోని గొడిగూడ పంచాయతీలో నిర్మిస్తున్న ఎయిర్‌స్ట్రిప్ పనుల పురోగతిపై సమీక్షించారు. దీనిపై కలెక్టర్‌తో చర్చించారు. అనంతరం ఉషా పాఢి చిత్రకొండ, బలిమెల ప్రాంతాల్లో ఉన్న ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలలు, పలు ఉన్నత పాఠశాలలను సందర్శించారు. అక్కడి విద్యార్థులతో మాట్లాడి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఐటీఐలో ఉన్న సిటీ టీసీ మినీ టుల్‌రూమ్‌ను పరిశీలించారు. సాంకేతిక విద్యలో ఎక్కువ మంది విద్యార్థులు భాగస్వామ్యం కావాలని సూచించారు. అనంతరం డీఆర్‌డీఏ మందిరంలో జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించి, వివిధ సమితుల్లో జరుగుతున్న రహదారి, అభివృద్ధి పనులు, విద్యాసంస్థల ఏర్పాట్లపై చర్చించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సోమారి టంగులు, మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ కవిత మొహంత, జిల్లా విద్యాశాఖ అధికారి మానస్ రంజన్ స్వాయి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

‘చేతబడి’ హత్య కేసులో ఏడుగురి అరెస్ట్



పోలీసుల అదుపులో నిందితులు



స్వాధీనం చేసుకున్న మారణాయుధాలు, సెల్‌ఫోన్లు

- నిందితులంతా ఒకే కుటుంబానికి చెందిన వారు

బరంపురం: ఆధునిక యుగంలో మూఢ నమ్మకాలతో ప్రాణాలు తీస్తున్న ఘటనలు ఇంకా కొనసాగుతున్నాయి. గంజాం జిల్లాలో ఇటీవల చేతబడి నెపంతో పూజారి హత్య చేసిన ఘటన చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించి కేసు నమోదు చేసిన పోలీసులు ఒకే కుటుంబానికి చెందని ఏడుగురు నిందితులను అరెస్ట్ చేశారు. దీనిపై ఐఐసీ అధికారి దీప్తిరంజన్ బెహరా తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాలోని దిగపండి పోలీసు స్టేషన్ పరిధి పితాంబరిపూర్ పంచాయతీకి చెందిన పూజారి బొంగాళి గ్రామంలో పలువురిపై చేతబడి చేస్తున్నాడనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈనెల 17న గంజాం అదే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు మారణాయుధాలతో అతనిపై దాడి చేసి, హతమార్చారు. ఘటనపై దిగపండి పోలీసులు కేసు నమోదు చేసి, హత్యతో సంబంధం ఉన్న ఓ మహిళతో సహా ఏడుగురు నిందితులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి హత్యకు వినియోగించిన క్రికెట్ వికెట్లు 2, ఇనుప రాడ్ 1, సెల్‌ఫోన్లు 5, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ప్రసన్న సెఠి, ఆయన భార్య కవిత సెఠి, బావమరిది ప్రతాప్ సెఠి, అరుస్ సెఠి, ఆదర్శ మహాపాత్రో, సంతోష్ నాయక్‌గా పోలీసులు గుర్తించారు.

సీసీ కెమెరాలతో నిఘా పటిష్టం


- చందిలి పోలీస్ స్టేషన్ పరిధిలో కెమెరాల ఏర్పాటు




ప్రసంగిస్తున్న ఐఐసీ యశ్వంత్, పక్కన జెడ్పీ సభ్యురాలు సంధ్య

రాయగడ: వరుసగా జరుగుతున్న దొంగతనాలు, దోపిడీ లను నియంత్రించడంతో పాటు పెరుగుతున్న ట్రాఫిక్ వ్యవస్థను కట్టడి చేసేందుకు పోలీస్ యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో జిల్లాలోని చందిలి పోలీస్ స్టేషన్ పరిధిలో సుమారు రూ.20 లక్షల వ్యయంతో ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్లు చందిలి ఐఐసీ యశ్వంత్ హియాల్ వెల్లడించారు. పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో శనివారం నిర్వహించిన ఆమె పోలీస్ సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. పెరుగుతున్న ట్రాఫిక్ వ్యవస్థను అదుపు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వాహనదారులు ట్రాఫిక్ నియమ, నిబంధనలను పాటిస్తేనే రోడ్డు ప్రమాదాలను అదుపు చేయవచ్చన్నారు. నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తప్పవని, వాహన లైసెన్స్‌లు కూడా రద్దు చేసేందుకు వెనుకాడమని హెచ్చరించారు. చందిలి పరిధిలో వివిధ ప్రాంతాలో మద్యం అక్రమ విక్రయాలు, సారా తాయారీ వంటి అసాంఘిక కార్యకలాపాలను నియంత్రించేందుకు పోలీస్ విభాగం తగు చర్యలు తీసుకుంటుందన్నారు. చోరీలను అదుపు చేసే ప్రక్రియలో భాగంగా తరచూ పెట్రోలింగ్ నిర్వహించేందుకు సన్నాహాలు చేపడతామని పేర్కొన్నారు. పలు గ్రామాల్లో తరచూ జరుగుతున్న వర్గ కలహాలు, తగాదాలను నియంత్రించేందుకు ప్రజలు సహకరించాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సభ్యురాలు సంధ్యా పులక, వాణిజ్య సంఘాల ప్రతినిధులు, సర్పంచ్‌లు, సమితి సభ్యులు పాల్గొన్నారు.

7768 కిలోల గంజాయి ధ్వంసం



పరిశ్రమలో గంజాయికి నిప్పంటిస్తున్న దృశ్యం



డీఐజీ రాజేష్‌కు వివరాలు తెలియజేస్తున్న అధికారులు, పక్కన ఎస్పీ శర్మ

రాయగడ: గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపిన జిల్లా పోలీస్ యంత్రాంగం.. రవాణా దారులకు దడ పుట్టించేలా విస్తృత దాడులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఇటీవల స్వాధీనం చేసుకున్న సుమారు 7768 కిలోల గంజాయిని పట్టణానికి సమీపంలోని ఇండియన్ మెటల్స్ అండ్ ఫెర్రో ఎల్లాయిస్ కర్మాగారంలో శనివారం ధ్వంసం చేశారు. దక్షిణాంచల్ డీఐజీ రాజేష్ పండిట్ సమక్షంలో అధికారులు ఈ ప్రక్రియ చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ వివేకానంద శర్మ, ఎక్సైజ్ సూపరింటెండెంట్ అభిరాం బెహరా, డీఎస్పీ సుశాంతకుమార్ తవుడియా, జిల్లా డిప్యూటీ కలెక్టర్ నారాయణ మిశ్రో, డాక్టర్ కిషోర్‌కుమార్ పాణిగ్రాహి తదితరులు పాల్గొన్నారు.

గూఢచర్యం కేసులో నిందితుడుకి రిమాండ్

- డీఆర్‌డీఏ సీనియర్ అధికారి బాబూరామ్‌ను ప్రశ్నిస్తున్న పోలీసులు

భువనేశ్వర్: చాందీపూర్ మధ్యంతర టెస్ట్ రేంజ్(ఐటీఆర్)లో పనిచేస్తున్న డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్(డీఆర్‌డీఓ) సీనియర్ టెక్నికల్ ఆఫీసర్ బాబూరామ్ డేను ప్రశ్నించేందుకు బాలేశ్వర్ సబ్ డివిజనల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్(ఎస్‌డీజేఎం) కోర్టు 4రోజుల రిమాండ్‌కు తరలించేందుకు అనుమతించింది. గూఢచర్యం వ్యవహారంలో పోలీసులు నిందితుడిని మరింత లోతుగా ప్రశ్నించేందుకు వీలుగా న్యాయస్థానం ఈ అవకాశం కల్పించింది. గూఢచర్యం ఆరోపణలపై బాబూరామ్‌ను పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. అతను వాట్సాప్ ద్వారా లైంగిక, ధన ప్రయోజనాల కోసం పాకిస్థాన్‌లోని విదేశీ ఏజెంట్‌కు క్షిపణి పరీక్షకు సంబంధించిన సున్నితమైన/రహస్య సమాచారాన్ని లీక్/షేర్/ట్రాన్స్ చేశాడని ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో నిందితుడిని 5 రోజుల రిమాండ్‌కు అప్పగించాలని పోలీసులు కోర్టును అభ్యర్థించారు. విచారణ జరిపిన న్యాయస్థానం 4 రోజుల రిమాండ్‌కు అనుమతించింది. శనివారం నుంచి గడువు లెక్కిస్తారని స్పష్టం చేసింది.

ఆస్తుల వివరాలపై..

నిందితుని ఆర్థిక లావాదేవీలు ప్రధానంగా ఆదాయానికి మించిన ఆస్తుల వివరాలు ఆరా తీసే కోణంలో విచారణ జరుపుతున్నట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి. బాబూరామ్ డే బాలాసోర్ జిల్లాలోని జలేశ్వర్ మండలం సంపటియా పంచాయతీ బాగ్‌పుంజి గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. భూ ఒప్పందాలు వగైరా వివరాలను జిల్లా పోలీసులకు నివేదించాలని స్థానిక తహసీల్దార్‌ను కోరినట్లు తెలిపారు. నిందితుడు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి కావడంతో ఆయన ఆస్తులపై విచారణ జరిపేందుకు జిల్లా పోలీసులు కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని ఫైనాన్షియల్ ఇన్వెస్టిగేషన్ యూనిట్(ఎఫ్‌ఐయూ) సహాయం తీసుకుంటున్నారన్నారు. గూఢచర్యం వ్యవహారంలో ఇప్పటి వరకు బాబూరామ్ డే ను మాత్రమే అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నట్లు బాలాసోర్ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ సాగరిక నాథ్ తెలిపారు. ఇప్పటి వరకు వేరెవ్వరినీ అదుపులోకి తీసుకోడం లేదా అరెస్ట్ చేయలేదని స్పష్టం చేశారు.



క్లుప్తంగా

వంతెనపై లారీ బోల్తా



ఘటనా స్థలంలో బోల్తా పడి ఉన్న లారీ

రాయగడ: జిల్లాలోని తెరువలి వంతెన వద్ద లారీ అదుపుతప్పి బోల్తాపడింది. మునిగుడ నుంచి రాయగడ మీదుగా అలూమిన పౌడర్ లోడ్‌తో వస్తున్న వాహనం.. తెరువలి వంతెన మలుపు వద్ద అదుపు తప్పడంతో ఈ ఘటన చోటు చేసుకుంది. ప్రమాదంలో డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. రోడ్డుకు మధ్యలో లారీ పడిపోవడంతో తెరువలి మీదుగా మునిగుడ, బిసంకటక్, అంబోదల తదితర ప్రాంతాలతో పాటు పుల్బాణి జిల్లాకు వెళ్లే వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో చందిలి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, జేసీబీ సాయంతో వాహనాన్ని పక్కకు తొలగించడంతో రాకపోకలు యథావిధిగా కొనసాగాయి.

కొట్లాటలో ముగ్గురికి గాయాలు

పొందూరు: పాన్‌షాపు బాకీ విషయంలో జరిగిన వివాదం కొట్లాటకు దారితీసి ముగ్గురికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పొందూరు పాత ఎస్‌బీఐ ఎదురుగా కిరాణా దుకాణం నిర్వహిస్తున్న అమ్మినాయుడుకు నూక శ్యామసుందర్ రూ.350 బాకీ ఉన్నారు. దీనిపై వివాదం రావడంతో శుక్రవారం రాత్రి 9 గంటల తరువాత దుకాణానికి శ్యామ్ సుందర్‌తో పాటు పి.రాము, పి.స్వాతి కుమార్, బి.పవన్‌లు వెళ్లారు. దుకాణదారుడి కుమారుడు మహేష్‌బాబుకు వీరికి వాగ్వాదం జరిగింది. ఈ సమయంలో ఇంటిలో ఉన్న అమ్మినాయుడు కత్తితో దాడిచేయడంతో శ్యామ్‌సుందర్, పవన్‌లకు గాయాలయ్యాయి. అక్కడే ఉన్న పేడాడ శ్యామలరావు అడ్డుకునే ప్రయత్నంలో చాకు అతని పొట్టలో దిగింది. తీవ్రగాయాలు కావడంతో ముగ్గురినీ పొందూరు సీహెచ్‌సీకి అక్కడి నుంచి శ్రీకాకుళం రిమ్స్‌కు 108 వాహనంలో తరలించారు. నూక శ్యామ్‌సుందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దుకాణం యజమాని చౌదరి అమ్మినాయుడు, అతని కుమారుడు మహేష్‌బాబులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ లక్ష్మణరావు తెలిపారు. కాగా, బాకీ సొమ్ము అడగడంతో రాత్రి వేళ ఇంటికి వచ్చి తమను తీవ్రంగా గాయపరిచారని, ఆత్మరక్షణ కోసమే అడ్డుకున్నామని అమ్మినాయుడు పోలీసులకు తెలిపారు.

బొలెరో ఢీకొని వ్యక్తి దుర్మరణం



మృతిచెందిన ఈశ్వరరావు

శ్రీకాకుళం రూరల్: మండలంలోని నవనంబాడు గ్రామానికి చెందిన అల్లు ఈశ్వరావు (55) శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈయన డీజిల్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. చింతాడ ఎఫ్‌సీఐ గోదాం పరిసర ప్రాంతంలో మోటార్ పనిచూసుకుంటూ కాలినడకన ఇంటికి వస్తుండగా కె.మన్నయ్యపేట వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం ఆటోను తప్పించబోయి ఈశ్వరరావును ఢీకొట్టింది. ఈ ఘటనలో ఈశ్వరరావు అక్కడికక్కడే మృతిచెందాడు. ఆటోలో మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. గాయపడిన వారిని 108లో రిమ్స్‌కు తరలించారు. రూరల్ ఎస్‌ఐ విజయ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ షాక్‌తో ఎలక్ట్రీషియన్ మృతి



రోదిస్తున్న కుటుంబ సభ్యులు, (ఇన్‌సెట్లో) మృతి చెందిన నారాయణరెడ్డి

రణస్థలం: మండలంలోని పైడిభీమవరం పంచాయతీ వరిసాం సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద జరిగిన ప్రమాదంలో ఎలక్ట్రీషియన్ చిల్లా నారాయణరెడ్డి(36) మృతి చెందాడు. జె.ఆర్.పురం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చిల్లపేటరాజాంకు చెందిన నారాయణరెడ్డి ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. పదేళ్లుగా పైడిభీమవరంలోనే నివాసం ఉంటున్నాడు. వరిసాం గ్రామానికి చెందిన మూర్తిరాజు ఇంట్లో ఎలక్ట్రికల్ పని నిమిత్తం శనివారం ఉదయం 10 గంటల సమయంలో పైడిభీమవరం సబ్ స్టేషన్ లైన్‌మేన్ ద్వారా ఎల్‌సీ తీసుకున్నాడు. వరిసాం సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఏబీ స్విచ్ లాగుతుండగా ఒక్కసారిగా విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. నారాయణరెడ్డికి ఇద్దరు భార్యలు, ఐదుగురు పిల్లలు ఉన్నారు. తండ్రి ఎల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు జె.ఆర్.పురం ఎస్సై జి.రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని శవపంచనామా నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు.

కొత్త ఒరవడితో ముందుకు సాగండి



మినీ మారథాన్‌కు సిద్ధమైన విద్యార్థులు, అధ్యాపకులు

- ఏఐసీటీయూ అధ్యక్షుడు టీజీ సీతారాం
- జీఐఈటీ విశ్వవిద్యాలయంలో వార్షికోత్సవాలు

రాయగడ: ప్రతి విద్యార్థి కొత్త ఆలోచనలతో ముందుకు సాగితే వారి భవిష్యత్ ఉజ్వలంగా మారుతుందని ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్(ఏఐసీటీయూ) అధ్యక్షుడు టీజీ సీతారాం సూచించారు. జిల్లాలోని గుణుపూర్‌లో గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ(జీఐఈటీ) విశ్వవిద్యాలయం సిల్వర్ జూబ్లీ ఉత్సవాలు శనివారం ప్రారంభించారు. ఈనెల 27వరకు జరగనున్న ఈ ఉత్సవాల్లో భాగంగా సృజన్-1.0 పేరిట నిర్వహించిన కార్యక్రమాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేటి ఆధునిక విద్యా విధానంలో ప్రతి విద్యార్థీ పోటీతత్వాన్ని ఎదుర్కొనే విధంగా వ్యూహాత్మకమైన ఆలోచనలతో ముందుకు సాగాలన్నారు. నూతన ఆవిష్కరణలకు నాంది పలికే విధంగా విద్యార్థుల ఆలోచనలు ఉంటే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వాటంతట అవే వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో గౌరవ అతిథిగా పాల్గొన్న ముంబైకి చెందిన ఫెరీ ఇండియా కంపెనీ పీఆర్‌ఓ సత్యేంద్ర శ్రీవాస్తవ్ మాట్లాడుతూ దేశంలో ఆధునిక సాంకేతిక విధానాలు ప్రారంభం కావడంతోకొత్త పరిశ్రమలు ప్రారంభమవుతున్నాయన్నారు. ఆయా రంగాల్లో ఉద్యోగాలు పొందాలంటే వాటిపై అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. అదేవిధంగా చురుకుదనం, మేధాశక్తితోపాటు కరెంట్ అఫైర్స్‌పై మంచి పట్టు సాధించాలని సూచించారు. సాంకేతిక రంగంలో దూసుకుపోతున్న దేశంలో ఎన్నో ఉపాధి అవకాశాలు వస్తుంటాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

ఆకట్టుకున్న ఏర్పాట్లు..

జీఐఈటీ విశ్వవిద్యాలయం అధ్యక్షుడు డాక్టర్ సత్య ప్రకాష్ పండా, ఉపాధ్యక్షుడు డాక్టర్ చంద్రధ్వజ పండా, డైరెక్టర్ డాక్టర్ జగదీష్ పండా, రెజిస్ట్రార్ డాక్టర్ ఏవీజీ రావు ప్రసంగించారు. అనంతరం విశ్వవిద్యాలయం వార్షిక నివేదిక, ప్రాయాస్ సావనీర్‌ను ప్రారంభించారు. అంతకుముందు ఉదయం మినీ మారథాన్ రేస్‌ను నిర్వహించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం టెక్నికల్ విభాగానికి చెందిన విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన స్వాగత ద్వారాలు, ఏర్పాట్లు ఆకట్టుకున్నాయి.



వార్షిక సంచికను విడుదల చేస్తున్న అతిథులు



కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు, విద్యార్థులు

దేవతా మూర్తులకు పిలుపు



అమ్మవారిని తీసుకు వచ్చేందుకు పయనమవుతున్న జాతర కమిటీ సభ్యులు, పూజారులు

మల్కన్‌గిరి: జిల్లాలో మార్చి 4నుంచి 7వరకు జరగనున్న బొడా జాతరకు దేవతామూర్తులను తీసుకు వచ్చేందుకు మల్కన్‌గిరి లోని దుర్గావీధిలో ఉన్న మౌలీమా ఆలయ పూజర్లు, కమిటీ సభ్యులు సిద్ధమయ్యారు. ఈ మేరకు దేవతా మూర్తులు బాలరాజు, కన్నంరాజు, పోతురాజ్(శ్రీకృష్ణ, అర్జునుడు, భీముడు, మా ముత్యాలమ్మ) పిలుపులకు పయనమయ్యారు. ఈ మేరకు ఆంధ్రా-ఒడిశా సరిహద్దు పోలేరు కొండల్లో ఉన్న మన్యంకొండకు అమ్మవారి సింహాసనంతో సహా 100కిలోమీటర్ల దూరాన్ని కాలి నడకనే చేరుకున్నారు. అక్కడ అంగరంగ వైభవంగా ఆహ్వానం పలికి, జిల్లా కేంద్రానికి తీసుకు వచ్చేందుకు ఏర్పాట్లు పూర్తిచేశారు. అక్కడి నదిలో బంగారు రంగు చేపలు వస్తేనే దేవతామూర్తులు దిగివస్తాయనే ఇక్కడి సంప్రదాయం.

టెన్త్ పరీక్షల ఏర్పాట్లపై సమీక్ష

శ్రీకాకుళం న్యూకాలనీ: ఏప్రిల్ 3 నుంచి జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే బాలబాలికలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం అధికారులకు సూచించారు. శనివారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో టెన్త్ పరీక్షల ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల్లో అన్ని మౌలిక సదుపాయాలు, ఏర్పాట్లు పక్కాగా ఉండాలన్నారు. నేలరాతలు జరగకుండా పక్కాగా ఏర్పాట్లు చేయాలని, వేసవి తాపం నేపథ్యంలో తాగునీరు, నిరంతరం విద్యుత్, తరగతి గదుల్లో ఫ్యాన్లు, వెలుతురు, మరుగుదొడ్లు పక్కాగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వైద్యఆరోగ్యశాఖ, రవాణాశాఖ, పోలీసుశాఖ, విద్యుత్‌శాఖ, సచివాలయం వ్యవస్థలంతా సమన్వయంతో పనిచేయాలన్నారు. డీఈఓ గార పగడాలమ్మ మాట్లాడుతూ జిల్లా నుంచి 29575 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్టు తెలిపారు. ఇందులో బాలురు14,770 మంది, బాలికలు14085 మంది ఉన్నారని చెప్పారు. ప్రైవేటుగా 456 మంది బాలురు, 264 మంది బాలికలు హాజరవుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి కె.వి.రమణ, విద్యాశాఖ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ లియాఖత్ అలీఖాన్, ధర్మాన సీతారాములు పాల్గొన్నారు.

59 మద్యం బాటిళ్లతో ఇద్దరు అరెస్ట్

మెళియాపుట్టి: మండలంలోని వసుంధర చెక్‌పోస్టు వద్ద ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు టెక్కలి ఎస్‌ఈబీ సీఐ అనిల్‌కుమార్ తెలిపారు. శనివారం ఆంధ్రా ఒడిశా సరిహద్దుల్లోని వసుంధర చెక్‌పోస్టు వద్ద ఎస్‌ఈబీ పోలీసు సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. ఒడిశాకు చెందిన ఇద్దరు వ్యక్తులు 59 మద్యం బాటిళ్లను టెక్కలి తరలిస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రెండు ద్విచక్ర వాహనాలు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని, వారిని కోర్టుకు తరలించినట్లు పేర్కొన్నారు.

సమావేశానికి ఆహ్వానం

అరసవల్లి: ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘ జిల్లా సర్వసభ్య సమావేశం మార్చి 1న జిల్లా కేంద్రంలోని గ్రాండ్ హోటల్‌లో నిర్వహిస్తున్నామని, ఈ సమావేశానికి హాజరుకావాలంటూ జెడ్పీ సీఈఓ ఆర్.వెంకటరామన్‌ను ఉద్యోగ సంఘ నేతలు ఆహ్వానించారు. ఈ మేరకు శనివారం జెడ్పీ సీఈఓతో పాటు పలు శాఖాధికారులకు ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఈ సందర్భంగా ఏపీజీఈఏ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రాజేశ్వరి మాట్లాడుతూ ఈ సర్వసభ్య సమావేశానికి సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ఆస్కార రావులు రానున్నారని తెలిపారు.

'వందశాతం ఉత్తీర్ణత సాధించాలి'

రణస్థలం: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో చదువుతున్న టెన్త్, ఇంటర్ విద్యార్థినులు వందశాతం ఉత్తీర్ణత సాధించాలని రాష్ట్ర అదనపు బాలబాలికల అభివృద్ధి అధికారి (జీసీడీఓ) మేరీ సుసన్ అన్నారు. మండలంలోని లంకపేట కేజీబీవీని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. కేజీబీవీ రికార్డులు పరిశీలించి, ఉపాధ్యాయినులు, విద్యార్థినులతో మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా జీసీడీఓ శోభ, ప్రిన్సిపాల్ ఎస్.హైమావతి, సిబ్బంది ఉన్నారు.

శ్రీకూర్మనాథాలయం అమృతాలయం



శ్రీకూర్మనాథాలయంలో కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి మహాస్వామి

గార: శ్రీకూర్మనాథాలయం అమృతాలయమని కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి మహాస్వామీజీ అన్నారు. ఆయన శనివారం సాయంత్రం శ్రీకూర్మనాథుడిని దర్శించుకున్నారు. మూలవిరాట్ వద్ద ప్రత్యేక పూజలనంతరం కాసేపు అనుగ్రహభాషణం చేశారు. ఆలయ ప్రధానార్చకులు చామర్తి సీతారామనృసింహాచార్యులు మంగళాశాసనం అందజేశారు. ఎంపీపీ గొండు రఘురాం, గొండు కృష్ణమూర్తి, వైస్ ఎంపీపీ అంధవరపు బాలకృష్ణమూర్తి, ఆలయ ఈఓ జి.గురునాథం, పాలక మండలి సభ్యులు డబ్బీరు వాసుదేవరావు, అనుపోజు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆదిత్యుని సన్నిధికి..

అరసవల్లి: అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి వారి సన్నిధికి ప్రసిద్ధ కంచికామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి మహాస్వామి ఆదివారం వచ్చి.. ఉదయం తొలి పూజల్లో పాల్గొననున్నట్లుగా ఆలయ ఈవో వి.హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు తెలియజేశారు. ఈ మేరకు ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని, భక్తుల సర్వదర్శనాలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నామని వారు వివరించారు.

ఏఓబీలో చెక్‌పోస్ట్ ఏర్పాటు

ఇచ్ఛాపురం రూరల్: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఆంధ్రా-ఒడిశా సరిహద్దు లొద్దపుట్టి ధనరాజులమ్మ ఆలయం సమీపంలో పోలీసులు తనిఖీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. శనివారం రూరల్ ఎస్‌ఐ కె. రామకృష్ణ తన సిబ్బందితో కలసి చెక్‌పోస్ట్ వద్ద వాహనాలను తనిఖీ చేశారు. ఎన్నికలు సందర్భంగా అక్రమంగా డబ్బులు, మద్యం వంటివి తరలిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. కాశీబుగ్గ డీఎస్పీ ఎం.శివరామిరెడ్డి చెక్‌పోస్టును తనిఖీ చేస్తూ, ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతంతో పాటు జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఎన్నికలు జరిగే వరకు తాత్కాలిక చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి తనిఖీలు చేస్తామన్నారు. ఇచ్ఛాపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆర్. ఈశ్వరచంద్ర ప్రసాద్ ఉన్నారు.



లొద్దపుట్టి చెక్‌పోస్టు వద్ద సిబ్బందితో మాట్లాడుతున్న డీఎస్పీ శివరామిరెడ్డి

వెయ్.. దరువెయ్



ఊరిలోని థియేటర్‌కు హీరో హీరోయిన్లు వచ్చారు.. దప్పుల దరువు అదిరిపోవాలి. పెళ్లి ఊరేగింపు యమా జోరుగా జరుగుతోంది.. తీన్‌మార్ మేళం మోతెక్కిపోవాలి. ప్రజా ప్రతినిధి గెలిచి ఊరికొస్తున్నాడు.. కార్యకర్తల సంతోషానికి దప్పు సౌండ్ మ్యాచ్ చేయాలి. వినాయక నిమజ్జనం, దేవీ విగ్రహాల అనుపు ఉత్సవం, ఊరి సంబరాలు.. వేడుక ఏదైనా ఆడే వేదిక మాత్రం తీన్‌మారే. జిల్లాలో ఒకప్పటి పాపులర్ సత్రసాగర్ దప్పు కళాకారులు ఇప్పుడు తీన్‌మార్ మేళంగా మారారు. వారికి ఇంకా చాలా మంది జత కలిశారు. నాటి కళకు నేటి దరువును జత చేస్తూ ఫంక్షన్లలో జంక్షన్లు జామ్ చేస్తున్నారు.



శుభకార్యంలో తీన్‌మార్ దప్పుల బృందం

- ఫంక్షన్ ఏదైనా తీన్‌మార్ మోత మోగాల్సిందే
- నాటి సాత్రసాగర్ డప్పు మేళమే నేటి తీన్‌మార్ ధూమ్ ధమాకా
- దుమ్ము లేపుతున్న డప్పు కళాకారులు

సండే స్పెషల్

కంచిలి:

తీన్‌మార్.. శుభకార్యం ఏదైనా తప్పనిసరిగా కనిపించాల్సిన, వినిపించాల్సిన పేరు. పార్టీ అయినా, ఫంక్షన్ అయినా ప్రొగ్రామ్ సక్సెస్ అవ్వాలంటే ఈ దరువు పడాల్సిందే. ఒకప్పుడు పెద్ద పెద్ద ఫంక్షన్లు నిర్వహించే వారు స్వాగత ద్వారం వద్ద ఈ డప్పు వాయిద్యాలను పెట్టి అతిథులను స్వాగతించేవారు. కాలక్రమేణా ఇది అన్ని శుభకార్యాల్లోనూ తప్పనిసరిగా మారిపోయింది. రాజకీయ పార్టీ ర్యాలీ, జాతర, తిరనాళ్లు, మిగతా మంచి కార్యక్రమాల్లో తీన్‌మార్ దరువేయడం కామనైపోయింది. ఇదంతా ఒక ఎత్తయితే ప్రత్యేకించి తీన్‌మార్ ధూమ్‌ధమాకా అంటూ డప్పు వాయిద్యాల ప్రొగ్రాం మరొక ఎత్తు. ఇవి లేకపోతే ఇప్పుడు సండడే ఉండడం లేదు.

జిల్లాలో కంచిలి మండలం గోకర్ణపురం గ్రామానికి చెందిన 'తీన్‌మార్ ధూమ్ ధమాకా' డప్పు వాయిద్యాలకు మంచి పేరుంది. ఈ ప్రాంతంలో ఎలాంటి శుభకార్యక్రమాలైనా వీటిని తప్పనిసరిగా పెడుతుంటారు. పెద్ద శబ్దంతో కూడిన ఈ డప్పుల మోత అన్ని వయసుల వారి చేత స్టెప్పులేయిస్తుంది. ఉద్దానం ప్రాంతంతోపాటు జిల్లాలోను వివిధ ప్రాంతాల వారు ఈ డప్పు వాయిద్యాలను బుక్ చేస్తుంటారు. గోకర్ణపురం గ్రామానికి చెందిన ఈ వాయిద్యకారులు పూర్వీకుల నుంచి 'ఢంకాలు' వాయించేవారు. ప్రస్తుత తరంవారు కొద్దిగా డిఫరెంట్‌గా ఆలోచించి, ఈ డప్పులను రూపొందించి , కొత్తరకమైన సౌండ్స్ వచ్చేలా సిద్ధం చేశారు. గత 18 ఏళ్లుగా వీరు ఈ తరహా కార్యక్రమాలతో ఉపాధి పొందుతున్నారు. శుభకార్యాలకు పెట్టే ఖర్చుకు తగినట్టుగా వారి ప్రోగ్రాం ధరలను కూడా నిర్ణయించి, సేవలందిస్తున్నారు.

ఈ డప్పులను శ్రీకాకుళం, నరసన్నపేట, పోలాకి తదితర దూరప్రాంతాల వారూ బుక్ చేస్తుంటారు. వీరు ఒక ప్రోగ్రాంకు పది మంది సభ్యులు హాజరై రకరకాల సినిమా పాటలు, ఆల్బమ్ పాటలు, లోకల్ పాటలు వాయి స్తూ యువతను ఉర్రూతలూగిస్తారు. గోకర్ణపురం గ్రామాన్ని గతంలో సత్రసాగర్ అనే పేరుతో పిలిచేవారు. దీంతో ఈ డప్పులకు సత్రసాగర్ డప్పులు అని కూడా స్థానికంగా పిలుస్తుంటారు. ఈ గ్రామంలో 7 బృందాలు ఈ వృత్తిలో ఉన్నాయి. వీరితోపా టు సోంపేట మండలం పాత్తంగి గ్రామంలో కూడా మరో రెండు బృందాలు ఉన్నాయి.

మంచి ప్రోగ్రామ్స్ వస్తున్నాయి..



తీన్‌మార్ ధూమ్ ధమాకా దప్పుల ఈవెంట్‌కు ఈ ప్రాంతంతోపాటు జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి మంచి ప్రోగ్రామ్స్ వస్తున్నాయి. మేము ఇచ్చే ప్రదర్శనలతో యువతరం ఉత్సాహంగా డ్యాన్స్ వేస్తూ మమ్మల్ని ప్రోత్సహిస్తున్నారు. ఇది ఎంతో సంతృప్తినిస్తోంది.

– రవి, తీన్‌మార్ ధూం ధమాకా దప్పు బృందం వాయిద్యకారుడు, గోకర్ణపురం గ్రామం, కంచిలి మండలం

పూర్వీకుల నుంచి..



సత్రసాగర్ (గోకర్ణపురం) లో ఉంటూ మా పూర్వీకుల నుంచి ఇద్దే వృత్తిని నమ్ముకొని జీవిస్తున్నాం. మా తరం వచ్చేటప్పటికి ఇప్పటి జీవన శైలికి తగినట్లుగా దప్పు వాయిద్యాలను మార్పుచేసి, ఇప్పటి తరానికి అనుగుణంగా తీన్‌మార్ ధూం ధమాకాగా రూపొందించాం. పది మందిని ఒక బృందంగా ఏర్పాటు చేసుకొని ప్రోగ్రామ్స్ ఇస్తున్నాం.

– సత్తు శ్రీనివాసరావు, తీన్‌మార్ ధూం ధమాకా దప్పు వాయిద్యకారుల యూనియన్ అధ్యక్షుడు

మధుర వదన.. నళిన నయన



దివ్యాలంకృతుడైన వాసుదేవ స్వామి

మందస: తిరుమల-తిరుపతిలోని వెంకటేశ్వరుడిని తలపించేలా మందసలోని వాసుదేవ పెరుమాళ్‌ను పండితులు శనివారం సుందరంగా అలంకరించారు. స్వామి బ్రహోత్సవాలు ఇటీవల వైభవంగా ముగియగా.. మళ్లీ వారం రోజుల అనంతరం స్వామిని దివ్యాలంకృతుని గావించి, భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు వాసుదేవుని దర్శించుకుని తన్మయత్వానికి గురయ్యారు.

దారి తప్పిన బుల్లి ఎలుగు



తోటల్లోకి వెళ్లడానికి మొరాయిస్తున్న ఎలుగుపిల్ల

మందస: ఎలుగు పిల్లలు ఊళ్లలోకి వచ్చేస్తున్నాయి. స్థానికులు మాత్రం వీటికి ఎలాంటి హాని తలపెట్టకుండా తిరిగి అడవిలోకి విడిచిపెడుతున్నారు. బహడపల్లి గ్రామంలోకి శనివారం ఎలుగు పిల్లలు ప్రవేశించాయి. తోటల్లోకి పంపడానికి ప్రయత్నించగా, వెళ్లడానికి మొరాయించాయి. దీంతో స్థానికులు వాటికి సపర్యలు చేసి.. ఆకలి తీర్చి తోటల్లోకి తీసుకెళ్లి విడిచిపెట్టారు.

క్లుప్తంగా

పాల ట్యాంకర్ బోల్తా



బోల్తా పడ్డ పాల ట్యాంకర్

బొబ్బిలి రూరల్: విశాఖ డెయిరీ పాల ట్యాంకర్ శనివారం వేకువజామున చింతాడ వద్ద చెరువులో బోల్తా పడింది. శుక్రవారం రాత్రి విశాఖ నుండి బయలుదేరిన ట్యాంకర్ మక్కువలో 7వేల లీటర్లు పాలు తీసుకుని బలిజిపేట వెళ్తుండగా, మంచు తీవ్రంగా కురియడంతో దారి తెలియక ట్యాంకరు అదుపుతప్పి బోల్తా పడినట్లు డ్రైవర్ రెహమాన్ తెలిపారు. డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. 2,500లీటర్ల పాలు నేల పాలైనట్లు విశాఖ డెయిరీ అధికారులు తెలిపారు. క్రేన్ సహాయంతో ట్యాంకర్‌ను బయటకు తీశారు. ఈ ప్రమాదంపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

గోస్తని నదిలో రెండు ఎద్దుల మృతి



గోస్తని నదిలో మృతి చెందిన ఎద్దు

జామి: గోస్తని నదిలో రెండు ఎద్దులు మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. తానవరం గ్రామానికి చెందిన సిరికి సూర్యచంద్రరావు శనివారం ఇసుక కోసం నాటుబండితో గ్రామం సమీపంలో ఉన్న గోస్తని నదిలోకి వెళ్లాడు. నదిలో పెద్ద పెద్ద గోతులు ఉండడంతో గోతులు ఉన్నాయని తెలియక బండితో నదిలోకి నాటు బండిని దించాడు. లోతు ఎక్కువగా ఉండడంతో నీటిలో మునిగి బండి పైకి నీటిలో లేచిపోవడంతో ఎద్దులకు బండికి కట్టిన తాడులు బిగుసుకుని ఊపిరి ఆడక మృతి చెందాయి. స్థానికులు ట్రాక్టర్లతో బండిని ఎద్దులను బయటకు లాగారు. బండిలో ఉన్న చంద్రరావు క్షేమంగా బయటపడ్డాడు. ఎద్దు ఖరీదు సుమారు రూ.90 వేలు ఉంటాయని స్థానికులు తెలిపారు.

5 కేజీల గంజాయి పట్టివేత



పట్టుకున్న ముద్దాయితో పోలీసు అధికారులు

సాలూరు: పట్టణంలో ఒడిశాకు చెందిన ఓ వ్యక్తి నుండి 5 కేజీల గంజాయి పట్టుకున్నట్లు సీఐ ధనుంజయ్ శనివారం తెలిపారు. పట్టణంలోని మామిడిపల్లి జంక్షన్ వద్ద శుక్రవారం సాయంత్రం వాహన తనిఖీలు చేపడుతుండగా, అనుమానాస్పదంగా కనిపించిన ఒడిశాకు చెందిన షేక్ ముస్తాక్‌ను పట్టుకున్నామని తెలిపారు. ఆ వ్యక్తి వద్ద 5 కేజీల గంజాయిను గుర్తించి వెంటనే అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసామని, ముద్దాయిని రిమాండ్‌కు తరలించామన్నారు. పట్టణ ఎస్‌ఐలు పాపారావు, నారాయణరావు ఉన్నారు.

భార్యను వదిలేసి వెళ్లిపోయిన భర్త

నెల్లిమర్ల రూరల్: భార్యను భర్త నడిరోడ్డుపై వదిలేసి వెళ్లిపోయిన ఘటన మండలంలోని సతివాడ గ్రామంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరలు.. విశాఖ జిల్లా మద్దిలపాలెంలో నివాసముంటున్న గుడ్ల ఈశ్వరమ్మ తన భర్తతో కలిసి ద్విచక్ర వాహనంపై శ్రీకాకుళం వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ఇద్దరి మధ్య స్వల్ప తగాదా నెలకొంది. దీంతో భార్య ఈశ్వరమ్మను సతివాడ పెట్రోల్ బంక్ వద్ద శుక్రవారం సాయంత్రం వదిలేసి వెళ్లిపోయాడు. అర్ధరాత్రి వరకు ఆమె రోదిస్తూ కూర్చోవడంతో గమనించిన కొందరు యువకులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ నారాయణరావు సిబ్బందిని అక్కడికి పంపించి స్థానికంగా ఆశ్రయం కల్పించారు. శనివారం ఉదయాన్నే ఆమె భర్త వచ్చి తీసుకువెళ్లారని ఎస్‌ఐ తెలిపారు.

బైక్ దొంగ అరెస్ట్

విజయనగరం క్రైమ్: స్థానిక రంజనీ థియేటర్ సమీపంలో గతేడాది ఏప్రిల్‌లో బైక్ చోరీ చేసిన పద్మనాభం మండలం రెడ్డిపల్లి నరేష్‌ను శనివారం అదుపులోకి తీసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు తెలిపారు. చోరీ చేసిన బైక్‌ను రికవరీ చేసినట్లు తెలిపారు. కేసును ఛేదించడంలో క్రియాశీలక పాత్ర పోషించిన ఎస్‌ఐ అశోక్, హెచ్‌సీ అచ్చిరాజు, కానిస్టేబుల్ శ్రీను తదితరులను సీఐ అభినందించారు.

శతశాతం ఫలితాలు సాధించాలి

విజయనగరం ఫూల్‌బాగ్: పదవ తరగతి పరీక్షల్లో శతశాతం ఫలితాలు సాధించే విధంగా కృషి చేయాలని డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి తెలిపారు. స్థానిక గురజాడ స్కూల్‌లో ప్రధానోపాధ్యాయులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై సమీక్షించారు. సమావేశంలో ఉప విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు, ఎంఈఓలు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

వందల్లో పెళ్లిళ్లు.. పదుల్లో నమోదు

వివాహం చేసుకునే దంపతులు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తమ వివాహాన్ని నమోదు చేసుకుంటే బహుళ ప్రయోజనాలు ఉన్నాయి. ముఖ్యంగా విదేశాలకు వెళ్లేవారికి ఇది చాలా అవసరం. అయితే ఈ విషయం తెలియని నూతన వధూవరులు ఆ దిశగా రిజిస్ట్రేషన్ చేసుకోవడం లేదు. దీంతో అత్యవసర సమయంలో అవస్థలు పడుతున్నారు.

- సచివాలయాల్లో ఉచితంగా రిజిస్ట్రేషన్లు
- ఏటా జిల్లా వ్యాప్తంగా 700 పైగా జరుగుతున్న వివాహాలు
- అధికారికంగా రిజిస్ట్రేషన్ చేయించుకోవటంలో అవగాహన లేమి



విజయనగరం కార్పొరేషన్‌కు చెందిన రమణమూర్తికి 59 ఏళ్లు. ఉద్యోగ రీత్యా కొడుకు విదేశాల్లో స్థిరపడ్డాడు. కొడుకును చూసేందుకు రమణమూర్తి ఆయన భార్య విదేశాలకు వెళ్లేందుకు నిర్ణయించుకున్నారు. అందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోగా... మీరిరువురు భార్యాభర్తలంటూ అధికారిక ధ్రువీకరణ పత్రం సమర్పించాలని అధికారులు సూచించారు. దీంతో చేసేదేమీ లేక 59 ఏళ్ల వయస్సులో రమణమూర్తి ఆయన భార్య సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి ధ్రువీకరణ పత్రం దరఖాస్తు చేసుకుని, సంతకాలు చేయాల్సి వచ్చింది.

విజయనగరం: వివాహం చేసుకున్న ప్రతి ఒక్కరు తప్పనిసరిగా అధికారికంగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సిన ఆవశ్యకత రోజు రోజుకు పెరుగుతోంది. ప్రస్తుత ప్రపంచంలో మనిషికి జనన, మరణ ధ్రువీకరణతో పాటు వైవాహిక ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా మారుతోంది. వైవాహిక జీవితంలోకి అడుగిడే యువత పెళ్లి తంతును బంధుమిత్రుల సమక్షంలో సంబరంగా జరుపుకుంటున్నారు. ఈ జ్ఞాపకాలను ఫొటోలు, వీడియోల రూపంలో భద్రపరుచుకుంటున్నారు. ఇదే సందర్భంలో ప్రాధాన్యమున్న వివాహ ధ్రువీకరణ పత్రాలు పొందే విషయంలో చాలా మంది నిర్లిప్తంగా ఉంటున్నారు. పెళ్లి జరిగిన తరువాత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, సచివాలయాల్లో నమోదు చేయించుకుంటే భవిష్యత్తులో అనేక ప్రయోజనాలు ఉన్నాయని సంబంధిత అధికారులు చెబుతున్నారు. జిల్లాలో వివాహల నమోదు ఆశించిన విధంగా సాగటం లేదు.

జిల్లాలో విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు బొబ్బిలి మున్సిపాలిటీ, నెల్లిమర్ల, రాజాం నగర పంచాయతీలతో పాటు 920కు పైగా గ్రామ పంచాయతీలున్నాయి. వీటి పరిధిలో సుమారు 780కు పైగా సచివాలయాలున్నాయి. ఏటా జిల్లా వ్యాప్తంగా 500 నుంచి 700 వరకు పెళ్లిళ్లు జరుగుతున్నాయని పురోహితులు పేర్కొంటున్నారు. ఇందులో పదుల సంఖ్యలోనే జంటల నమోదు పట్టణ ప్రాంతాల్లో నమోదు ఒక మోస్తరుగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం ఈ తంతు మొక్కుబడిగానే సాగుతున్నాయి. గతంలో పెళ్లి చేసుకున్న దంపతులు రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనే వివరాలు నమోదు చేయించుకోవాల్సి వచ్చేది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ప్రస్తుతం సచివాలయాల్లోనూ ఈ అవకాశం కల్పించింది. పెళ్లి చేసుకున్న నవ దంపతులు మూడు నెలల్లోపు ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చు. నెలలోపు అయితే ఎలాంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదు. నెల దాటితే రూ.100 చలానా కట్టాలి. మూడు నెలలు దాటితే సమీప సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

జిల్లాలో ప్రస్తుతం వందల సంఖ్యలో పెళ్లిళ్లు జరుగుతున్నా విదేశాలకు వెళ్లేవారు, లీగల్ అవసరాలున్నవారు మాత్రమే నమోదు చేయించుకుంటున్నారు. ప్రతి జంట వివాహ బంధాన్ని చట్టపరంగా నమోదు చేయించుకోవాలి. ప్రస్తుతం ఆన్‌లైన్ విధానం అమల్లోకి వచ్చిందని, స్లాట్ బుక్ చేసుకుంటే నిర్ణీత తేదీ, సమయంలో వచ్చి వివాహ ధ్రువపత్రాలు పొందవచ్చని అధికారులు పేర్కొంటున్నారు.

ఎన్నో ప్రయోజనాలు

విదేశాలకు వెళ్లే దంపతులకు పాస్ పోర్టు, వీసా, వర్క్ పర్మిట్, బీమా తదితర విషయాల్లో పెళ్లి ధ్రువపత్రం ఉపయోగపడుతుంది. ఈ పత్రం ఉంటే ఉద్యోగులు భార్య లేదా భర్తను నామినీగా నమోదు చేయించుకోవడానికి వీలవుతుంది. భవిష్యత్తులో భార్యాభర్తల మధ్య ఇబ్బందులు ఎదురైతే కేసులు, కోర్టులో సాక్ష్యాల విషయంలో పెళ్లి ధ్రువీకరణ పత్రం ఉపయోగపడుతుంది. వివరాలతో నింపిన దరఖాస్తుతో పాటు దంపతులిద్దరి ఆధార్ నకళ్లు, జనన ధ్రువీకరణ పత్రాలు, పదో తరగతి మార్కుల జాబితా, పాస్ పోర్టు సైజ్ ఫొటోలు, శుభలేఖ, తాళి కడుతున్న చిత్రాలు సమర్పించాల్సి ఉంటుంది.

తప్పనిసరి

నూతన వధూవరులు తప్పనిసరిగా పెళ్లి వివరాలను నమోదు చేయించుకోవాలి. ఆపై ధ్రువీకరణ పత్రం కోసం స్థానిక సచివాలయాల్లో దరఖాస్తులు చేసుకోవాలి. దరఖాస్తు చేసుకున్న వారం రోజుల్లో పరిశీలన అనంతరం ధ్రువీకరణ పత్రం అందిస్తారు. ఈ ప్రక్రియపై అవగాహన కల్పించాలని సచివాలయ సిబ్బందికి తెలియజేశాం.

– రెడ్డి శ్రీరాములనాయుడు, కమిషనర్, విజయనగరం కార్పొరేషన్

గర్భిణి అనుమానాస్పద మృతి

- వివాహమై ఆరు నెలలు గడవక ముందే..
- తమ కుమార్తెను హత్య చేశారంటున్న తల్లిదండ్రులు





మృతి చెందిన ధనలక్ష్మి మృతదేహం (ఇన్‌సెట్లో) గులివిందల ధనలక్ష్మి (ఫైల్)



మృతదేహాన్ని పరిశీలిస్తున్న రాజాం సీఐ తదితరులు

రేగిడి: వివాహమైన ఆరు నెలలకే ఐదు నెలల గర్భిణి అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. అత్తింటి వారే తమ బిడ్డను చంపేశారని గర్భిణి తల్లిదండ్రులు ఆరోపిస్తుండగా.. ఫ్యాన్‌కు ఉరి వేసుకొని చనిపోయిందని అత్తింటివారు చెబుతున్నారు. వాస్తవాలు తెలియాల్సి ఉంది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని ఉంగరాడ గ్రామానికి చెందిన గులివిందల ధనలక్ష్మి(24) శుక్రవారం రాత్రి తమ ఇంట్లోనే అనుమానాస్పదంగా మృతి చెందింది. మండలంలోని జోడుబందల గ్రామానికి చెందిన ధనలక్ష్మిని గత ఏడాది ఆగస్టు 5న ఉంగరాడ గ్రామానికి చెందిన గులివిందల గౌరినాయుడుకు ఇచ్చి వివాహం చేశారు. భర్తతో కలిసి అత్తవారింట్లోనే ఉంటోంది. ధనలక్ష్మి ఐదు నెలల గర్భిణి, ఈ నెల 24న అత్తవారి ఇంటి నుంచి బయలుదేరి బ్యాంకు పని నిమిత్తం రాజాం వెళ్లింది. తిరిగి సాయంత్రానికి ఇంటికి చేరుకుంది. తనకు చెప్పకుండా ఎక్కడికి వెళ్లావని భర్త ప్రశ్నించగా రాజాం వెళ్లానని చెప్పింది. ఈ విషయమై భార్యను గౌరినాయుడు నిలదీశాడు. భోజనం చేసిన తరువాత తనకున్న కోళ్ల ఫారానికి కోడి పిల్లలు వస్తున్నాయని ఫోన్ రావడంతో గౌరినాయుడు వెళ్లిపోయాడు. రాత్రంతా కోళ్ల ఫారం వద్దే గౌరినాయుడు ఉన్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు. ధనలక్ష్మి తెల్లవారిన తరువాత ఎప్పటికీ తలుపులు తీయకపోవడంతో సమాచారాన్ని భర్త గౌరినాయుడుకు తెలియజేశారు. గౌరినాయుడు వచ్చి బలవంతంగా తలుపులు తీసేసరికి ఇంట్లో ఉన్న ఫ్యాన్‌కు ధనలక్ష్మి వేలాడుతూ కనిపించింది. అప్పటికే మృతి చెందింది. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులు ధనలక్ష్మి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. ఈ విషయంపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. వరకట్నం వేధింపులు, అనుమానాస్పద మృతి కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రాజాం రూరల్ సీఐ హెచ్.ఉపేంద్రరావు విలేకరులకు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ఎస్‌ఐ శ్రీనివాసరావు, ఏఎస్‌ఐ రాజారావు, సిబ్బంది గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చూశారు. బొబ్బిలి డీఎస్పీ మోహనరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చంపేశారు..

తమ కుమార్తెను అత్తింటివారే చంపేశారని ధనలక్ష్మి తల్లిదండ్రులు రౌతు రాముడమ్మ, గణపతిరావులు విలపిస్తున్నారు. తమ కుమార్తె గర్భవతి కావడంతో ఎంతో సంతోషించామని ఆత్మహత్య చేసుకునేంత పిరికిది కాదన్నారు. విషయాన్ని తెలుసుకున్న రాజాం సీఐ హెచ్.ఉపేంద్రరావు, తహసీల్దార్ టి.కల్యాణచక్రవర్తి గ్రామానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పరిశీలించారు. ఇరు కుటుంబాలను విషయం అడిగి తెలుసుకున్నారు. సాయంత్రం వరకు మృతదేహాన్ని ఇంటిలోనే ఉంచారు. ఓ వైపు ధనలక్ష్మి కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులంతా తరలి వచ్చారు. ఉంగరాడలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

ప్రయోగ పరీక్షలకు వేళాయె

- సీసీ కెమెరా నిఘాలో పరీక్షలు
- హాజరుకానున్న 25,227 మంది విద్యార్థులు
- 101 కేంద్రాల్లో నేటి నుంచి మార్చి 7వరకు నిర్వహణ



రాజాం ప్రభుత్వ బాలుర కళాశాలలో ప్రాక్టికల్స్‌కు సిద్ధంచేసిన ల్యాబ్

రాజాం సిటీ: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం సైన్స్ విద్యార్థులకు ప్రయోగ పరీక్షలు ఆదివారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఇప్పటికే అన్ని కేంద్రాల్లో అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. సీసీ కెమెరాలను అమర్చారు. ఈ నెల 20 నుంచి ఒకేషనల్ గ్రూపులకు సంబంధించి ప్రాక్టికల్స్ జరుగుతుండగా, 26 నుంచి మార్చి 7వ తేదీవరకు సైన్స్ విద్యార్థులకు పరీక్షలు జరగనున్నవి. ఉమ్మడి విజయనగరం జిల్లాతో పాటు పాత శ్రీకాకుళం జిల్లాలోని రాజాం, పాలకొండ నియోజకవర్గాల్లోని మొత్తం 25,227 మంది సైన్స్ విద్యార్థులు ప్రాక్టికల్స్‌కు హాజరుకానున్నారు. నాన్ జంబ్లింగ్ విధానంలో జరిగే ఈ పరీక్షలకు 101 కేంద్రాలు కేటాయించగా, వీరిలో ఎంపీసీ విభాగంలో 18,451 మంది విద్యార్థులు ఫిజిక్స్, కెమెస్ట్రీ ప్రాక్టికల్స్‌కు, బైపీసీ విభాగంలో 6,776 మంది విద్యార్థులు బోటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ పరీక్షలకు హాజరుకానున్నారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు పరీక్షలు జరగనున్నవి. పరీక్షల పర్యవేక్షణకు చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులు, ఎగ్జామినర్లతోపాటు ఇతర సిబ్బందిని నియమించారు. ఆయా కేంద్రాలకు నామినల్ రోల్స్‌తోపాటు ఫొటో చెక్‌లిస్టులు, ఇతర మెటీరియల్ పంపిణీ చేశారు.

జాతర పిలుపు

- నేటి నుంచి చీపురుపల్లి కనకమహాలక్ష్మి, జామి ఎల్లారమ్మ జాతర
- పోలీస్ బందోబస్తు ఏర్పాటు
- కనకమహాలక్ష్మిని దర్శించుకోనున్న మంత్రి బొత్స, జెడ్పీ ఛైర్మన్, ఎంపీ



జామి ఎల్లారమ్మ ఆలయం

చీపురుపల్లి: కనకమహాలక్ష్మి జాతర రాకతో చీపురుపల్లి పట్టణంతోపాటు పరిసర గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభ నెలకుంది. ఆదివారం తెల్లవారు జామున 1 గంట నుంచే అమ్మవారి దర్శనాలు ప్రారంభంకానున్నాయి. ఈ మేరకు దేవదాయ ధర్మాదాయశాఖ, ఆలయ కమిటీ సంయుక్తంగా ఏర్పాట్లు పూర్తి చేశారు. అమ్మవారి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. సాంస్కృతిక ప్రదర్శనలకు వేదికలను సిద్ధం చేస్తున్నారు.

554 మందితో పోలీస్ బందోబస్తు

మూడు రోజుల పాటు జరగనున్న అమ్మవారి జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా 554 మంది పోలీస్ సిబ్బంది, రెండు ప్రత్యేక పార్టీలతో బందోబస్తు నిర్వహిస్తున్నట్టు సర్కిల్‌ఇన్‌స్పెక్టర్ జి.సంజీవరావు, ఎస్‌ఐ ఎ.సన్యాసినాయుడు తెలిపారు. డీఎస్పీలు ముగ్గురు, సర్కిల్ ఇన్స్‌పెక్టర్లు-8మంది, ఎస్‌ఐ-38మంది, ఏఎస్‌ఐ, హెచ్‌సీలు-117మంది, కానిస్టేబుళ్లు 192 మంది, హోంగార్డులు 134మంది, మహిళా పోలీసులు 62మందితో పాటు రెండు ప్రత్యేక బృందాలు బందోబస్తు విధుల్లో పాల్గొంటాయన్నారు.

- జాతరలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించే వేదిక వెనుక భాగంలో తోటపల్లి కాలువ ఉంది. సాంస్కృతిక కార్యక్రమాలు సమయంలో భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. ఎలాంటి ప్రమాదం జరగకుండా ఆలయ కమిటీ జాగ్రత్త చర్యలు పాటించింది. కాలువ పొడవునా బారికేడ్లు ఏర్పాటు చేశారు.

అమ్మవారిని దర్శించుకోనున్న నేతలు

తొలిరోజు ఆదివారం అమ్మవారిని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌లు కుటుంబ సమేతంగా హాజరై అమ్మవారికి పూజలు చేయనున్నారు.



కనకమహాలక్ష్మి అమ్మవారు



సృష్టిలో బిడ్డ ఆకలి తల్లికి మాత్రమే తెలుస్తోందనేందుకు ఈ చిత్రమే సజీవసాక్ష్యం. జాతివైరం మరచిన ఓ శునకం పంది పిల్లలకు పాలిచ్చిన దృశ్యం విజయనగరం పట్టణంలోని కాటవీధిలో శనివారం కనిపించింది. దీనిని చూసిన వారంతా తల్లిప్రేమ అంటూ అభివర్ణించారు.

– విజయనగరం టౌన్

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



ఈశ్వరరావు మృతదేహం

రామభద్రపురం: మండలంలో ఈ నెల 17వ తేదీన ఆరికతోట వద్ద కర్రల లోడుతో ట్రాక్టర్ బొల్తా పడిన ప్రమాద ఘటనలో గాయపడిన వ్యక్తి విశాఖపట్టణం కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. తారాపురం గ్రామానికి చెందిన బెవర ఈశ్వరరావు(52)కర్రలు కొట్టేందుకు రోజూ కూలీకి వెళ్లేవాడు. రోజూలాగే ఈ నెల 17వ తేదీన కూడా వెళ్లి, ట్రాక్టర్‌కు కర్రలు లోడు వేసుకుని కర్రల మిల్లుకు వెళ్తుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడింది. తీవ్ర గాయాలైన ఈశ్వరరావును చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు విశాఖపట్టణం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్‌ఐ సురేంద్రనాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కుటుంబాన్ని పోషించే పెద్ద దిక్కు కోల్పోవడంతో భార్య, పిల్లలు రోదిస్తున్నారు.

ఆటోడ్రైవర్ నిజాయితీ



బ్యాగ్‌లను, నగదును అందజేస్తున్న వన్‌టౌన్ సిఐ బి.వెంకటరావు

విజయనగరం క్రైమ్: స్థానిక అయ్యన్నపేటకు చెందిన సైలాడ ఉమాశంకర్ తన ఆటోలో హైదరాబాద్‌కి చెందిన వ్యక్తులను రణస్థలం తీసుకువెళ్లేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఆటోలో ప్రయాణిస్తూ రణస్థలం వద్ద దిగే సమయంలో వారి రెండు బ్యాగ్‌లను ఆటోలో మర్చిపోయారు. ఇది గమనించిన డ్రైవర్ తమ ఇంటికి వచ్చిన తర్వాత ఆటోలో బ్యాగ్‌లను గమనించి వన్‌టౌన్ పోలీసులకు బ్యాగ్‌లను అప్పగించారు. బ్యాగ్‌లను పరిశీలించిన పోలీసులు ఆటోలో ప్రయాణించిన వ్యక్తులను గుర్తించి, వారి సూచనల మేరకు వారి బంధువులకు బ్యాగ్‌లను అందజేశారు. బాగ్‌లో రూ.6100 నగదు, మందులు, వ్యాపారానికి సంబంధించిన యంత్రాలు, రక్షలు, ఇతర వస్తువులున్నాయి. బ్యాగ్ యజమానులను గుర్తించడంలో క్రియాశీలకంగా వ్యవహరించిన వన్‌టౌన్ హెచ్‌సీ ఎవి.రమణను, నిజాయితో వ్యవహరించిన ఆటోడ్రైవర్ ఉమాశంకర్‌ను సీఐ అభినందించారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి



మొక్కలు నాటుతున్న వైస్ చాన్సలర్ వెంకట సుబ్బయ్య

విజయనగరం టౌన్:

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని జేఎన్‌టీయూ గురజాడ వైస్ చాన్సలర్ కె.వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. స్థానిక విశ్వవిద్యాలయం ఆవరణలో శనివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవాళికి అవసరమయ్యే ప్రాణ వాయువును అందించే మొక్కలను నాటడమే కాకుండా అవి పెరిగి, పెద్దవి అయ్యే విధంగా బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూ జీవీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీకుమార్, ఈఈఈ విభాగాధిపతి ఎ.పద్మజ, డాక్టర్ వివిఎస్.వకుళ, డాక్టర్ సిహెచ్.బిందుమాధురి, డాక్టర్ జి.అప్పలనాయుడు, డాక్టర్ సిహెచ్.సీలిమా దేవి తదితరులు పాల్గొన్నారు.

దిశ చట్టంతో సత్వర న్యాయం

- రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు గడ్డం ఉమ



కార్యక్రమంలో మాట్లాడుతున్న రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు ఉమ, ఎస్‌పీసీఆర్ అప్పారావు

విజయనగరం ఫోర్ట్: దిశ చట్టం వచ్చిన తర్వాత సత్వరన్యాయం అందుతుందనే నమ్మకం ప్రజల్లో నెలకొందని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు గడ్డం ఉమ, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు పేర్కొన్నారు. విజయనగరం దిశ వన్‌స్టాప్ సెంటర్‌లో ఇటీవల లైంగిక దాడికి గురైన పిల్లలతో మాట్లాడారు. ప్రభుత్వం మహిళల రక్షణకు అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో దిశ చట్టంపై మరింతగా అవగాహన కల్పించాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో దిశ వన్ స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ సాయివిజయలక్ష్మి, డీసీపీయూ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అభినందనలు



షేక్ అబ్దుల్‌హమీద్‌ను అభినందిస్తున్న జెడ్పీ ఛైర్మన్

బొబ్బిలి: వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన షేక్ అబ్దుల్‌హమీద్‌ను జిల్లా కేంద్రంలో జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు(చిన్నశ్రీను), పట్టణంలోని ముస్లిం ప్రతినిధులు శనివారం అభినందించారు. పార్టీ పటిష్టతకు కృషిచేయాలని జెడ్పీ ఛైర్మన్ సూచించారు. కార్యక్రమంలో జేసీఎస్ పట్టణ కన్వీనర్ రేజేటి విను పాల్గొన్నారు.

టీకా ప్రక్రియ పరిశీలన



టీకా ప్రక్రియపై ఆరా తీస్తున్న రామేశ్వరప్రభ

పూసపాటిరేగ: మండలంలోని పూసపాటిరేగ, కందివలస, చోడమ్మఅగ్రహారంలో శనివారం ఐదేళ్లలోపు పిల్లలకు వేసిన వ్యాధినిరోధక టీకా కార్యక్రమాన్ని జిల్లా లెప్రసీ, టీబీ అధికారిణి రామేశ్వరప్రభ పరిశీలించారు. టీకా ప్రయోజనాలను తల్లిదండ్రులకు వివరించారు. పూసపాటిరేగ పీహెచ్‌సీలో రికార్డులు తనిఖీ చేసి, రోగులకు అందుతున్న సేవలను వైద్యాధికారి రాజేష్ వర్మను అడిగితెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా పబ్లిక్ హెల్త్‌నర్సు వసంత, సీహెచ్‌ఓ వేదమణి, హెచ్‌వీ నానమ్మ, సిబ్బంది గణపతి, వర్మ, రమణ, బంగారుబాబు పాల్గొన్నారు.

త్రోబాల్‌లో సత్తాచూపారు



పతకాలు సాధించిన విద్యార్థులతో పాఠశాల సిబ్బంది

గుర్ల: కేరళ రాష్ట్రం ఎర్నాకులంలో జరిగిన జాతీయస్థాయి త్రోబాల్ పోటీల్లో చింతలపేట హైస్కూల్ విద్యార్థులు సత్తాచూపారు. సీనియర్స్ విభాగంలో సంచాన దుర్గాప్రసాద్ రజతం, అండర్-19 విభాగంలో పి.యశ్వంత్, మజ్జి వర్షిణి కాంస్య పతకాలు సాధించారు. వీరిని పాఠశాల హెచ్‌ఎం శారద, పీడీ కె.లక్ష్మణ్, ఉపాధ్యాయులు పాఠశాలలో శనివారం అభినందించారు.